అట్టహాసం..!

- ఉల్లాసంగా.. ఉత్సాహంగా కర్నూలు బాలోత్సవం ప్రారంభం
- పిల్లల్లోని నైపుణ్యాలను వెలికితీయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్/క్రైం

పిల్లల పండగ 4వ కర్నూలు బాలోత్సవం గురువారం నగర శివార్లలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల వేదికగా అట్టహాసంగా ప్రారంభమైంది. తొలుత జాతీయ జెండాను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, బాలోత్సవం పతాకాన్ని బాలోత్సవం గౌరవాధ్యక్షులు, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య ఎగురవేశారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి మాంటిస్సోరి విద్యాసంస్థల వ్యవస్థాపకులు కీర్తిశేషులు కళ్యాణమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కళ్యాణమ్మ వేదిక మీద కర్నూలు బాలోత్సవం అధ్యక్షులు బడేసాహెబ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లోని నైపుణ్యాలను వెలికితీయాలని సూచించారు. తాను కష్ణా జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు అమరావతి బాలోత్సవంలో పాల్గొన్నట్లు గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఇతర కార్యక్రమాల్లోనూ పాల్గొనేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చూడాలన్నారు. తాను పాఠశాలల్లో మోనో యాక్షన్‌లో ఇన్‌స్పెక్టర్ రంజిత్ డైలాగ్ చెప్పేవాడినని, అందుకే తన పేరు కూడా రంజిత్‌గా మారిందని చెప్పారు. పిల్లలు వారిలోని నైపుణ్యం చూపడంవల్ల ఒక మంచి పేరు వస్తుందన్నారు. నైపుణ్యాలను వెలికితీయడం, పోటీతత్వం పెంపొందించడానికి ఈ ఉత్సవాలు తోడ్పడతాయని తెలిపారు. సంస్కతిని ముందు తరాలకు అందజేస్తే అది ఒక నాగరికతగా మారుతుందని, అందుకు ఇది ఒక వేదిక అవుతుందని అన్నారు. అకడమిక్ పోటీలు పిల్లల్లోని సృజనాత్మకతను బయటకు తీస్తాయని, పోటీతత్వం ఏర్పడుతుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. డిఇఒ శామ్యూల్ పాల్ మాట్లాడుతూ ఇది పిల్లలకు ఒక పండగని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు మంచి వేదికని చెప్పారు. విద్యార్థులోని సృజనాత్మకతను బయటకు తీసేందుకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, అందుకు నిర్వహణ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. విద్యతో పాటు అన్నీ కలిసి ఉన్నపుడే విద్యార్థి సమగ్రంగా అభివృద్ధి చెందుతాడని తెలిపారు. పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని అనడానికి జిల్లా కలెక్టర్ ఒక ఉదాహరణ, ఆదర్శం అని చెప్పారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు వెళ్లాలని, అవి బాల్యం నుంచే అలవర్చుకోవాలని తెలిపారు. బాలోత్సవ కమిటీ రాష్ట్ర నాయకులు రామరాజు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో 30 పట్టణాల్లో బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మార్కులకే పరిమితం కావడం, ఇతర రంగాల్లో ప్రావీణ్యం లేకపోవడం వల్ల ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. పోటీల ద్వారా పిల్లల్లో మానసిక పెరుగుదల ఉంటుందన్నారు. పిల్లలను ఆడనివ్వాలని, పాడనివ్వాలని, వాటిని ప్రోత్సహించడానికి బాలోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి మండలంలోనూ బాలోత్సవాలు నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలని కోరారు. బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి.పుల్లయ్య మాట్లాడుతూ ఇలాంటి వేదికలను ఉపయోగించుకునే విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు వీలుంటుందని చెప్పారు. గెలవడం కన్నా పాల్గొనడమే ఒక విజయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మొదటి రోజు 22 రకాల సాంస్కతిక, అకడమిక్ పోటీలు నిర్వహించారు. కల్యాణమ్మ వేదిక, గాదె సుబ్బారెడ్డి వేదికల మీద శాస్త్రీయ నృత్యం, సంప్రదాయ నృత్యం, వక్తత్వ, వ్యాస రచన, చిత్ర లేఖనం, గీతాలాపన పోటీలు నిర్వహించారు. మొత్తంగా 57 పాఠశాలల నుండి 2వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలోత్సవం కమిటీ సభ్యులు ఎల్లా గౌడ్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్శిటీ డీన్ డాక్టర్ అక్తర్ భాను, ప్రయివేటు విద్యా సంస్థల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు పిబివి సుబ్బయ్య, కర్నూలు బాలోత్సవం కన్వీనర్ ధనుంజయ, ప్రధాన కార్యదర్శి జెఎన్ శేషయ్య, మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత రాజశేఖర్, సిఇఒ విల్సన్, ప్రిన్సిపల్ మీనాక్షి విల్సన్, ప్రయివేటు విద్యా సంస్థల సంఘం జిల్లా అధ్యక్షులు వాసుదేవయ్య, కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంఇఒ శ్రీనివాసులు, ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్, కమిటీ సభ్యులు కె.సురేష్ కుమార్, జంద్యాల రఘుబాబు, యుఆర్‌ఎ రవి కుమార్, ఎస్‌ఎం జయరాజు, టి.నరసింహా, నవీన్ పాటి, హేమంత్ కుమార్, రంగస్వామి, రమాదేవి, సుధీర్ రాజు, ఖజా హుస్సేన్, చంద్ర మోహన్, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా. పక్కన డిఇఒ శ్యాముల్‌పాల్, పుల్లయ్య, అక్తర్ భాను.

జెండాను ఎగుర వేస్తున్న కలెక్టర్, పుల్లయ్య

బాలోత్సవంలో నేడు..

శుక్రవారం కూడా బాలోత్సవం కొనసానుంది. జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, ఏక పాత్రాభినయం, జానపద గీతాలాపన, కోలాటం పోటీలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ముగింపు సభ నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

రోడ్డు విస్తరణ పనులు జరిగేనా..?

- పత్తికొండలో విస్తరిస్తున్న ట్రాఫిక్ సమస్యలు

ప్రజాశక్తి-పత్తికొండ

ట్రాఫిక్ సమస్య, ఇరుకురోడ్లతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న సంఘటనలు పత్తికొండ డివిజన్ కేంద్రంలో ఎక్కువైంది. గత వైసిపి ప్రభుత్వంలో రోడ్డు విస్తరణ పనులు చేపడతామని గొప్పలు చెప్పిన నాయకులు అధికారం కోల్పోయారు. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డు విస్తరణ పనులు జరిగి ట్రాఫిక్ సమస్య తీరుతుందని ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. పత్తికొండ పట్టణంలోని సుమారు రెండు కిలోమీటర్ల మేరకు విస్తరణ పనులు జరిగితే ట్రాఫిక్ అంతరాయం లేకుండా సునాయాసంగా ప్రయాణించవచ్చని ప్రయాణికులు చెబుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలంటే స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. పత్తికొండ పట్టణంలోని సుమారు 30 వేల మంది జనాభా జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ప్రధాన రోడ్డు 20 అడుగుల ఉండడంతో ట్రాఫిక్‌తో ప్రజలు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 60 అడుగులు విస్తరణ జరిగితే వాహనదారులు, ప్రయాణికులకు, పాదచారులకు బాగుంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రోడ్డు విస్తరణకు ఇరువైపులో ఉన్న గృహదారులు ఇంటిని కోల్పోయి రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 266 కుటుంబాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కుటుంబానికి అందిస్తే తీవ్రంగా నష్టపోతామని కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. దాదాపు 60 మంది విస్తరణ పనులు ఆగాలని కోర్టుకెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. రోజురోజుకు ట్రాఫిక్ సమస్యతో ప్రభుత్వ ఉద్యోగులు, స్కూల్ పిల్లలు, చిరు వ్యాపారులు, పోలీసులు సతమతమవుతున్నారు. మూడేళ్ల కిందట పత్తికొండను రెవిన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ పత్తికొండలో ఏర్పాటు అయ్యాయి. పత్తికొండ ,తుగ్గలి, మద్దికేర ,దేవనకొండ, ఆస్పరి ,ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి, క్రిష్ణగిరి ప్రజలు రోజూ వేలాదిమంది పత్తికొండకు రాకపోకలు సాగిస్తున్నారు. ఊరు వాకిలి నుండి గుత్తిసర్కిల్, గుత్తిసర్కిల్ నుండి చక్రాలరోడ్డులో ఎదురెదురుగా వస్తూ వాహనాలను ఢీకొని ప్రాణాలు పోయిన సంఘటనలు కూడా పత్తికొండలో చోటుచేసుకున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల సమయాలలో పత్తికొండను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెబుతూ, తీరా గెలిచాక పత్తికొండను అభివృద్ధి చేయడం లేదని వామపక్ష పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పత్తికొండ విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

వన్ వే ట్రాఫిక్ అమలు చేయాలి

- ప్రధాన రోడ్డు నివాసి ఆదిశేషయ్య శెట్టి

మసీదు రోడ్డు, వెంకటేశ్వర స్వామి దేవాలయం రోడ్డు ద్వారా వన్‌వే ట్రాఫిక్ అమలు చేయాలి. ఆ రెండు మార్గాలు అమలు చేయడం వల్ల ప్రధాన రోడ్డు మార్గం ప్రయాణం సునాయా సంగా జరుగుతుంది. పోలీసులు వన్ వే ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

1.5 కిలోమీటర్ 15 నిమిషాలు...

- బొకారి ఫర్నిచర్ షాపు యజమాని.. కపిల్ బొకారి

చక్రాల రోడ్డు నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. 1.5 కిలోమీటర్ల మేరకు 15 నిమిషాలు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు రోడ్డు విస్తరణ పనులు సకాలంలో చేపట్టాలని కోరారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

- పత్తికొండ అర్బన్ సిఐ జయన్న

పత్తికొండ పట్టణంలోని ట్రాఫిక్ సమస్య తలెత్తుకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. తోపుడుబండ్లు, చిరు వ్యాపారస్తులు డ్రైనేజ్ కాలువ వెలుపల ఉండాలని చెప్పాం. గుత్తి సర్కిల్ అంబేద్కర్ సర్కిల్, వైఎస్‌ఆర్ సర్కిల్‌లో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తున్నాం. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. రోడ్డు విస్తరణతో పూర్తిగా ట్రాఫిక్ నియంత్రణ సాధ్యం.

హెల్మెట్ తప్పనిసరి

- హెల్మెట్ ధరించి ర్యాలీలో కలెక్టర్, ఎస్‌పి
- ప్రణాళికా బద్ధంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణ
- రహదారి భద్రత మనందరి భాధ్యత

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాష, జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు 2025లో భాగంగా గురువారం హెల్మెట్ ధరించడంపై జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ పై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. హెల్మెట్ ధరించి కలెక్టర్, ఎస్‌పి స్వయంగా ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రదర్శన జిల్లా పోలీసు కార్యాలయం నుండి ప్రారంభమై కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్, కలెక్టరేట్ మీదుగా సి.క్యాంపు సెంటర్ వరకు కొనసాగింది. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ....జాతీయ రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రతపై ప్రజలలో అవగాహన కల్పించేందుకే ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పౌరుడు తన భద్రతకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. క్షేమంగా వెళుతున్నా అవతలి వ్యక్తులు ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి బైక్‌లు నడిపి ఇతరులను రోడ్డు ప్రమాదాలకు గురి చేస్తున్నారన్నారు. ఈ ప్రమాదాలలో హెల్మెట్ ధరించకపోవడంవల్లనే చనిపోతున్నారన్నారు. అందరూ ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారన్నారు. నేషనల్ హైవే అథారిటి, ఆర్ అండ్ బి శాఖలతో అవసరమైన చోట్ల సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. 6 నెలల్లో ప్రణాళిక బద్ధంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామన్నారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జనవరి 16 నుండి ఫిబ్రవరి 15 వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ బాధ్యతగా హెల్మెట్ ధరించాలన్నారు. తలకు హెల్మెట్ ధరించడం వలన 90 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గించవచ్చున్నారు. ప్రతి ఒక్క ద్వి చక్రవాహనదారుడు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఇటీవలే హై కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. కర్నూలు పట్టణంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపేవిధంగా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. రహదారి భద్రత మనందరి భాధ్యత, జిల్లా ప్రజలు, మీడియా సహకరించాలన్నారు. డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమిషనల్ శాంతకుమారి, సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఆర్‌డిఒ సందీప్ కుమార్, అడిషనల్ కమాండెంట్ నాగేంద్రరావు, అడిషనల్ ఎస్‌పిలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డిఎస్‌పిలు, సిఐలు, ఆర్‌ఐలు, ఆర్‌టిఒ అధికారులు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ట్రాఫిక్ పోలీసులు, సివిల్, ఎఆర్, ఎపిఎస్‌పి, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది, షోరూంల సిబ్బంది, డ్రైవింగ్ స్కూళ్ల వారు ర్యాలీలో పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పాఠశాలల బలోపేతం అవసరం

విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ రంజిత్‌బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాఠశాలలు బలోపేతం అయ్యేలా చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం నియోజకవర్గ స్పెషల్ అధికారులతో, డిప్యూటీ విద్యాశాఖాధికారులతో, మండల విద్యాశాఖాధికారులతో కలెక్టర్ కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యా శాఖ రూపొందించిన గైడ్‌లైన్స్ ప్రకారం పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతం అయ్యేలా ప్రతిపాదనలను రూపొందించాలని సూచించారు. ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, కర్నూలు నియోజకవర్గాలకు సంబంధించిన క్లస్టర్ల వారీగా పాఠశాలలు, విద్యార్థుల వివరాలను మండల విద్యా శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, డిఇఒ శామ్యూల్ పాల్, డిఆర్‌డిఎ పిడి నాగశివలీల, డిపిఒ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లులో రోడ్డు ప్రమాదం

ఇద్దరు మృతి ఆరుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్ : ఓర్వకల్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రాంగ్ రూట్లో వెళ్తున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి గాయాలైన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రైనింగ్ డిఎస్‌పి ఉషశ్రీ, తాలూకా సిఐ చంద్రబాబు నాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాకు చెందిన 12 మంది తిరుపతి దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో ఓర్వకల్లు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రాంగ్ రూట్లో వస్తున్నట్రాక్టర్ కారును ఢీకొట్టడంతో కారు పల్టీ కొట్టి డివైడర్‌లో పడింది. అందులో 12 మంది ప్రయాణిస్తున్న వారిలోఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరానిక చిన్నారి, రజిత మృతి చెందారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్ తహశీల్దార్ విద్యాసాగర్ ఎస్‌ఐ సునీల్ కుమార్ పరామర్శించారు.

ఈతకు వెళ్లి ఒకరు మృతి

ప్రజాశక్తి-గూడూరు

సుంకేసుల డ్యామ్ కింది భాగం మురెన్న గుంతదగ్గర గురువారం ముగ్గురు స్నేహితులు ఈతకు వెళ్లగా ఒకరు గల్లంతయి శవమై దొరికాడు. పోలీసుల వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి గ్రామానికి చెందిన షేక్‌రఫి, షేక్‌గని, షేక్ రహిమాన్ సుంకేసుల డ్యాం కిందిభాగంలో మురెన్న గుంతదగ్గర ఈతకు వెళ్లారు. ఉదయం 11 గంటలకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో షేక్ రఫి(17) నీటిలో కొట్టుకు పోయాడు. అది గమనించిన కొట్టుకుపోయిన రఫి స్నేహితులు సమీపంలో చేపలు పట్టే గజ ఈతగాళ్లకు విషయం చెప్పారు. గల్లంతయిన రఫికోసం చాలాసేపు నీటిలో వెతికారు. ఫలితం దక్కలేదు. ఎట్టకేలకు సాయంత్రం 5-30 గంటలకు షేక్ రఫి శవమై కనిపించాడు.

లో ఓల్టేజి సమస్య పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఎఇకి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

29వ వార్డు సవారి తోట కాలనీలో లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సిపిఎం ప్రతినిధి బృందం ఇండస్ట్రియల్ ఎస్టేట్లోని ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్ కవితకు వినతి పత్రం సమర్పించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు జి. ఏసు, శరీన్ నగర్ సిపిఎం నాయకులు పి మౌలాలి, పి.హుస్సేన్ మాట్లాడుతూ శరీన్ నగర్ 29వ వార్డు సవారి తోట ఎస్ ఎన్ /7. బి 23 పరిధిలో ఉన్న ఇంటి నెంబర్లు 81/234/23, 81/234/10, 81/234/24 ఇల్లు ఉన్న ప్రాంతాలలో దాదాపు కొంతకాలంగా లో ఓల్టేజ్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారను. లో ఓల్టేజ్ ఉండటం వల్ల ఇంట్లో ఉన్న బల్బులు పూర్తిస్థాయిలో వెలగడం లేదని తెలిపారు. టివిలు ఫ్యాన్లు పనిచేయడం లేదని, దానివల్ల ప్రజలు ఫ్యాన్లు టివిలు లేక ఉక్కపోతతో నిద్రలేక రాత్రంతా జాగరణ చేయాల్సి వస్తుందన్నారు. రాత్రి నిద్ర కాయడం వల్ల ఉదయం పూట పనులకు వెళ్లలేని పరిస్థితి ఉందని తెలిపారు. రాత్రిపూట చాలా ఇబ్బందికరంగా ఉందని, వీధిలో ఉన్న వీధిలైట్లు కూడా సరిగా వెలగనందువల్ల ప్రజలు వీధుల్లో వెళ్లాలంటే పాములు, తేళ్ళ భయం ఎక్కువగా ఉందన్నారు.కరెంటు పూర్తి స్థాయిలో సరఫరా అయ్యేలా మరొక ట్రాన్స్ ఫారం ఏర్పాటు చేయాలని ఎఇని కోరారు. ఎఇ కవిత మాట్లాడుతూ ఎస్టిమేషన్ వేసి కార్పొరేషన్ వారికి పంపామని అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

పాలి క్లినిక్, స్కానింగ్ కేంద్రాల తనిఖీ

లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు పట్టణంలోని ఆద్య మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, కెకె పాలి క్లినిక్‌లో స్కానింగ్ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. శాంతికళ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆమె మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రం నండలి రికార్డ్స్, రిపోర్టులను పరిశీలించామని తెలిపారు. జిల్లా లోని స్కానింగ్ కేంద్రాల వారు రికార్డ్స్, రిపోర్ట్స్ నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే పిసి, పిఎన్‌డిటి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పవిత్రమైన వైద్య వృత్తిని ఎంచుకున్న వారంతా ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డెమో శ్రీనివాసులు శెట్టి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఆద్య మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ శాంతకళ

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రజాశక్తి- సి బెళగల్

కేంద్ర ప్రభుత్వం కార్మికులను కార్పొరేటర్లకు ఊడిగం చేసేందుకు అమలులోకి తీసుకొస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు డివిజన్ నాయకులు మోహన్ డిమాండ్ చేశారు. మండల సిఐటియు నాయకురాలు ఉషారాణి అధ్యక్షతన మండల కార్యకర్తల సమక్షంలో పార్కు ముందు ఆందోళన చేపట్టారు. ఇక్కడే అప్పటి బ్రిటిష్ ప్రభుత్వంలో ఎందరో కార్మికులు ఎనిమిది గంటల పని కోసం ప్రాణాలు అర్పించగా కార్మికసంక్షేమంకోరి 44 కార్మిక చట్టాలను అమలు లోకి తెచ్చారని అన్నారు. కార్మికులను కార్పొరేట్, పారిశ్రామిక, పెట్టుబడి దారులకు బానిసలుగా చేసేందుకు 44 చట్టాలను 4 కోడులుగా తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని తగదని హెచ్చరించారు. 2019లో నుండి ఈ ప్రయత్నం చేస్తున్నా పోరాటాల ఫలితంగా అమలు కాలేదని ప్రస్తుతం ఎలాగైనా సాధించే యత్నంలో బిజెపి ప్రభుత్వం పూనుకుందన్నారు. పోరాటాలతో బిజెపి వ్యూహం తిప్పికొట్టాలని కోరారు.

సి బెళగల్‌లో సిఐటియు ఆధ్వర్యంలో నరసన

భారీ కటౌట్‌తో ప్రమాదం

విద్యుత్ వైర్లకు తగిలి కాలిపోయిన కంప్యూటర్లు, ఇతర పరికరాలు

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్



కర్నూలు చౌరస్తా వద్దగల ఎంజి బ్రదర్స్ ముందు నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరికటౌట్ పెట్టేందుకు అనుమతించిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంజి బ్రదర్స్ జనరల్ మేనేజర్ షేక్షావలి గురువారం ఒక ప్రకటనలో కోరారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఎంజీ బ్రదర్ షోరూం ముందు ఏర్పాటుచేసిన ఎంపి శబరి కటౌట్ అకస్మాత్తుగా ఎలక్ట్రిక్ టెన్షన్ వైర్లపై పడటంతో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడి ఎంజిబి కార్యాలయంలోని కంప్యూటర్‌లోని సిపియు, ప్రింటర్లు, ట్యూబ్‌లైట్లు కాలిపోయాయి. దీనితో తీవ్ర నష్టం వాటిల్లింది. ఎంజి హెచ్ పి సిఎల్ పెట్రోల్ బంక్ ఇయు పంపులన్నీ ఫెయిల్ అయి సాయంత్రం వరకు అమ్మకాలు ఆగిపోయాయి. అదృష్టవశాత్తు ప్రధాన రహదారిపై ప్రయాణించే ప్రజలకు ఎలాంటి గాయాలు కాలేదు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా భారీకటౌట్లను నగరంలో అనుమతించకూడదని విజ్ఞప్తి చేశారు.

భారీ కటౌట్లను వెంటనే తొలగించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బళ్లారి చౌరస్తాలో నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి భారీ కటౌట్ కూలి విద్యుత్ తీగల పైన పడిపోవడం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కంప్యూటర్లు, లాప్టాప్‌లు, ప్రింటర్లు కాలిపోయాయి. ఐదు గంటల పాటు పెట్రోల్ బంకు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర ,నగేష్ తెలిపారు. నగరంలో భారీ కటౌట్‌లు ఏర్పాటు చేసి నెలలు తరబడి తొలగించకపోవడంతో అవి విరిగిపడి ఆస్తి ప్రాణ నష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నించారు.

మున్సిపల్ అధికారుల, ఆ నాయకులు బాధ్యత వహిస్తారా అని ప్రశ్నించారు. కటౌట్లపై నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

తుగ్గలికి 75 గోకులం షెడ్లు : ఎంపిడిఒ

ప్రజాశక్తి -తుగ్గలి

తుగ్గలి మండలంలోని గ్రామాలకు 75 గోకులం షెడ్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ విశ్వమోహన్ గురువారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాటిలో 45 షెడ్లు పూర్తయ్యాయని, 13 షెడ్లు పునాదుల వరకు పూర్తికాగా, 10 షెడ్లకు పనులు జరుగుతున్నాయన్నారు. మరో 7 షెడ్లు రూఫ్ లెవెల్ వరకు పూర్తయ్యాయని అన్నారు. 6 పశువుల షెడ్లకు రూ.2,30,000, 4 పశువుల షెడ్లకు రూ.1,80,000 వెచ్చించి నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు.

ఎమ్మెల్యే విరుపాక్షిని సన్మానిస్తున్న సోషల్ మీడియా అధ్యక్షులు, నాయకులు

కష్టపడే వారికి సముచిత స్థానం

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసం అంకితభావంతో పని చేసిన ప్రతి కార్యకర్తకూ వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి తెలిపారు. గురువారం చిప్పగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులుగా ఎన్నికైన మౌనేష్, హోళగుంద మండల నాయకులు ఎమ్మెల్యే విరుపాక్షిని, వైసిపి యువ నాయకులు చంద్రశేఖర్, సోదరులు శ్రీరాములు, వెంకటేష్‌ను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇప్పటికీ వైసిపికి జనాదరణ తగ్గలేదని, ప్రతి వైసిపి కార్యకర్త అంకితభావంతో పని చేస్తున్నందుకే ఏ గ్రామం వెళ్లినా వైసిపికి జనాదరణ రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. అధినేత ఆదేశాలను నిర్వర్తిస్తూ.. వైసిపి పాలనలో ప్రతి నిరుపేద లబ్ధి పొందడం వల్లే పేదలు మనల్ని ఆప్యాయంగా పలకరిస్తున్నారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు కల్లబొల్లి హామీలు ఇచ్చి ఇప్పటికీ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజల్లో పూర్తిగా అసంతృప్తి నెలకొందని తెలిపారు. రాబోయే కాలం తమదేనని, ఎవరూ అధైర్య పడకుండా పార్టీ కోసం కష్టపడుతూ ప్రజలకు అండగా నిలబడాలని సూచించారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.గిరి, హోళగుంద మండల కన్వీనర్ సఫీవుల్లా, తాలూకా విద్యార్థి విభాగం అధ్యక్షులు రాజు, వైసిపి సీనియర్ నాయకులు శేషప్ప, దర్గప్ప, శ్రీనివాస్ రెడ్డి, సర్పంచి రాధాకృష్ణ, వైసిపి యువ నాయకులు శంబులింగ, హనుమంతు, హరీష్, ఈశ్వర్, మేఘనాథ్, ఈరన్న, నవీన్, శ్రీను, రమేష్, వీరభద్రప్ప, సాయి పాల్గొన్నారు.

భయాందోళన వీడి పరీక్షలకు సిద్ధం కండి

- న్యాయవాది వాయుజీవోత్తమ రావు

ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తున్న న్యాయవాది, నాయకులు

ప్రజాశక్తి - ఆలూరు

పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలపై భయాందోళన వీడి పరీక్షలు రాసేందుకు సిద్ధం కావాలని ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వాయు జీవోత్తమ రావు, షేక్షావలీ తెలిపారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం మోడల్ పరీక్షలు మండల వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వాయుజీవోత్తమ రావు, ఆర్.షేక్షావలీ, పాఠశాల ఉపాధ్యాయులు గిరయ్య ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలపై అవగాహన కోసం, పబ్లిక్ పరీక్షల పట్ల భయాందోళన చెందకుండా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పరీక్షలు విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకోవడంతో పాటు చదువుపై శ్రద్ధ వహించి మంచి మార్కులు సాధించాలని చెప్పారు. పరీక్షలు రాసేటప్పుడు ఏమాత్రం భయం వద్దన్నారు. న్యాయవాదులు ప్రవీణ్ కుమార్, షాకీర్, ఉపాధ్యాయులు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు మైనా, గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఉమేష్, ఉపాధ్యక్షులు బోటయ్య, చంద్ర, యశ్వంత్, ఖాజా పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

గోనెగండ్ల పోలీసు స్టేషన్‌ను గురువారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకస్మికగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలు, లాకప్ గదులను పరిశీలించి, రికార్డుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల వివరాలు, ప్రధాన పండగలు, ఉత్సవాల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణలో ఉన్న గ్రామస్తులతో మండలంలో పరిస్థితులు, వ్యవసాయం, ప్రధాన పంటల గురించి మాట్లాడారు. అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ... సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. సిఐ గంగాధర్, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్లు యూసుఫ్, దేవరాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- ఎంపిపి అమ్రేష్

ప్రజాశక్తి - కౌతాళం

రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఎంపిపి అమ్రేష్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అమ్రేష్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు కోసం ఈనెల 7వ తేదీ చివరి రోజు కావడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులకు గురవుతున్నారని కౌతాళం సర్పంచి పాల్ దినకరన్ తెలిపారు. కుల, ఆదాయ ధ్రువపత్రాలు పొందడానికి సమయం సరిపోవడం లేదని, రుణాల దరఖాస్తు గడువును పెంచాలని కోరారు. వేసవిలో నీటి సరఫరాకు ఇబ్బంది కలుగకుండా ఉండాలంటే రాజనగర్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు 24 గంటలూ విద్యుత్ సరఫరా అయ్యేలా అధికారులు చూడాలని కోరారు. ఏళ్ల తరబడి ఉన్న విద్యుత్ లైన్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిడిఒ సుబ్బరాజు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో బోర్ల మరమ్మతులుంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ఎపిఎం ఫరీద్ ఖాన్ మాట్లాడుతూ... బాల్యవివాహాలను అరికట్టడానికి సామాజిక బాధ్యతగా అందరూ తీసుకోవాలని చెప్పారు. మహిళా పొదుపు సంఘాల మాదిరి పురుషుల పొదుపు సంఘాలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. భూ విస్తీర్ణంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్ కోరారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం సర్పంచులు ఎంపిటిసిలు కృషి చేయాలని తెలిపారు. వైస్ ఎంపిపిలు రామలింగయ్య స్వామి, లిఖిత, డాక్టర్ కిరణ్, ఫరీద్ ఖాన్, డాక్టర్ జగదీష్ బాబు, అరుణకుమారి, ఎల్ఎల్‌సి అసిస్టెంట్ ఇంజినీర్ ఈశ్వర్, నరసన్న, నాగ మల్లయ్య, కార్యాలయపు పరిపాలన అధికారి సత్యన్న, సీనియర్ అసిస్టెంట్ రామయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

భూ హక్కు ధ్రువీకరణ పత్రం మాకు సంబంధం లేదు : పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి - ఆలూరు

గ్రామ, పట్టణాల్లో ఉన్న భవనాలు, ఖాళీ స్థలాలకు భూ హక్కు ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు తమకు (పంచాయతీ కార్యదర్శులు) సంబంధం లేదని మండల కార్యదర్శులు ఉరుకుందు, విజయ్ కుమార్, వెంకట నాయుడు తెలిపారు. గురువారం ఆలూరు ఇన్‌ఛార్జీ సబ్ రిజిస్ట్రార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామ, పట్టణాల్లో భవనాలను, ఖాళీ స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే భూ హక్కు ధ్రువీకరణ పత్రం తీసుకు రావాలని రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది, రైటర్లు తమ వద్దకు పంపుతున్నారని తెలిపారు. హై కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూహక్కు ధ్రువీకరణ పత్రం ఇవ్వడం జరగదని తెలిపారు. జిలాన్ బాష, గర్జప్ప, హుస్సేనప్ప, రామాంజనమ్మ పాల్గొన్నారు.

శివ భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - నందవరం

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం హాలహర్వి గ్రామంలో శివ భక్తులకు అన్నదానం నిర్వహించారు. మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ముల్లా ఖాజా, పెద్ద మాబు, మహబూబ్ బాషా, రసూల్, డాక్టర్ బాషా, మునాఫ్, చాంద్ బాషా, అబ్దుల్ గని, కమల్ పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న సభ్యులు

ఘనంగా కృష్ణమ్మ వివాహ వార్షికోత్సవం

కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ వివాహ వార్షికోత్సవ వేడుకలను టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేస్తూ కృష్ణమ్మ సైన్యం ఆధ్వర్యంలో పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ దగ్గర ఉండే అన్న క్యాంటీన్, శ్రీనివాస భవన్ దగ్గర అన్న క్యాంటీన్‌లో నిరుపేదలకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. నాయకులు వడ్డేమాన్ గోపాల్, వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ గాజుల చంద్రశేఖర్, బలాదూర్ బజారప్ప, ఆరెకల్ తిమ్మారెడ్డి, సాధిక్ వలీ, అల్తాఫ్ హుస్సేన్, మండగిరి మురళీ, అలసందగుత్తి రాజశేఖర్, గణేకల్ బంగారు బాబు, నాగనాథనహళ్లి రవి, భారత్ ఉన్నారు.

'టిడిపిలో చేరింది.. వైసిపి వారు కాదు'

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపిలోకి చేరిన వారు వైసిపి వారు కాదని సర్పంచి తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. గురువారం స్థానిక రాయరదర్శిని హోటల్‌లో వైసిపి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని వైసిపికి చెందిన పలు కుటుంబాలు టిడిపిలోకి చేరాయనే వార్త నిజం కాదని, టిడిపిలో చేరిన వారికి వైసిపికి ఎలాంటి సంబంధమూ లేదని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకు ఏ వైసిపి నాయకులు, కార్యకర్తలు కుడా టిడిపిలో చేరలేదని తెలిపారు. పార్టీకి సంబంధం లేని సాధారణ వ్యక్తులకు, ఉపాధి కూలీలకు పార్టీ కండువా కప్పి పార్టీలో చేరినట్లు ప్రకటన ఇవ్వడంపై మండిపడ్డారు. ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, వైసిపి నాయకులు, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు కె.మల్లికార్జున, నాయకులు శివకుమార్, జనార్ధన్ రెడ్డి ఉన్నారు.

సూగూరు దేవరలో టిడిపి ప్రముఖులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని సూగూరు గ్రామంలో దేవమ్మ, మారెమ్మ దేవర సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులురెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి సోదరులు ఎన్.రామకృష్ణారెడ్డి అమ్మవార్లను వేర్వేరుగా దర్శించుకున్నారు. గురువారం బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డితో కలిసి గ్రామానికి చేరుకున్నారు. నాయకులు భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచి ఈరన్న, నాగేష్, నరసింహా, శేఖర్ స్వాగతం పలికారు. ఆయనకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. టిడిపి సీనియర్ నాయకులు హండే హనుమంతు, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, తిక్కస్వామి గౌడ్, నర్సారెడ్డి, నారాయణ, నాగరాజు, హనుమంతు, నాయకులు సుజ్ఞానం, దుబ్బన్న పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న శ్రీనివాసులురెడ్డి

గాజులదిన్నె ప్రాజెక్టుకు పూర్వవైభవం

మత్స్యకేంద్రం ఆధునీకరణతో

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టులో మత్స్య సంపద (చేప పిల్లల) ఉత్పత్తి కేంద్రాన్ని ఆధునీకరించడంతో పాటు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది ప్రాజెక్టుకు పూర్వ వైభవం తెస్తామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద నిర్వహించిన మత్స్యకారుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మత్స్యశాఖ జిల్లా అధికారి శ్యామల మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, రుణాల గురించి వివరించారు. గాజులదిన్నె ప్రాజెక్టులోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి గతంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేసి పంపిణీ చేసిన చరిత్ర ఉందని తెలిపారు. అలాంటి ఉత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ మత్స్య సంపద ఉత్పత్తి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఈ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో పునర్నిర్మిస్తామని, గాజులదిన్నె ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది పూర్వ వైభవం తెస్తామని తెలిపారు. మత్స్యకారులు కూడా కేవలం చేపల వేటనే కాకుండా ప్రభుత్వాలు అందించే పథకాలను, రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలన్నారు. తహశీల్దార్ కుమారస్వామి, ఎంపిడిఒ మణిమంజరి, ప్రాజెక్టు డిఇ విజయ్ కుమార్, ఎఫ్‌డిఒ చంద్రయ్య, మత్స్యకారుల సొసైటీ అధ్యక్షులు రంగస్వామి, గాజులదిన్నె హనుమంతు, తిమ్మారెడ్డి, ఎన్‌వి.రామాంజనేయులు, నజీర్ సాహెబ్, తిరుపతయ్య నాయుడు, రంగస్వామి నాయుడు, పెద్దమరివీడు మల్లయ్య, పూజారి చంద్ర, పిల్లిగుండ్ల జయపాల్, గాజులదిన్నె సంజన్న, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

భూసేకరణపై విచారణ చేపట్టాలి

- కలెక్టర్‌కు ఎమ్మెల్యే పార్థసారథి ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణ శివారులోని జగనన్న కాలనీ ఏర్పాటు కోసం భూసేకరణలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. గురువారం కలెక్టర్ పి.రంజిత్ బాషాకు కర్నూలులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీ కోసం సేకరించిన భూముల కొనుగోలులో లక్షలాది రూపాయల అవినీతి జరిగిందన్నారు. ఆదోనిలో రూ.15 కోట్లు, రాష్ట్రంలో రూ.2,500 కోట్లు వైసిపి నేతలు లూటీ చేశారని తెలిపారు. అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ప్రస్తుత కౌన్సిలర్లు, వైసిపి నాయకుల ప్రమేయం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇతరులు తమ పేర్లపై జగనన్న కాలనీకి ఇచ్చిన రైతులను బెదిరించి రూ.15 కోట్ల రైతుల సొమ్మును స్వాహా చేసినట్లు పేర్కొన్నారు.

'దరఖాస్తు గడువు పొడిగించాలి'

ప్రజాశక్తి- దేవనకొండ

బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పొడిగించి అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు సబ్సిడీ బ్యాంకు రుణాలివ్వాలని ఎఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం ఎఐవైఎఫ్ మండల ప్రతినిధి బృందం ఎంపిడిఒ సూర్య నారాయణను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలం లో నిరుద్యోగ యువత వందల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన బీసీ కార్పొరేషన్ రుణాల ప్రక్రియలో భాగంగా గడువును ఈనెల 7 వరకు ప్రకటించిందని చెప్పారు. తక్కువ సమయం కేటాయించడం వల్ల కుల ధ్రువీకరణ పత్రం పొందేందుకు తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆలస్యమవుతోందని తెలిపారు. గడువు పొడిగించి అర్హత కలిగిన బీసీ నిరుద్యోగ యువతకు బ్యాంకులో సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఎఐవైఎఫ్ మండల నాయకులు భూపేష్, వీరాంజనేయులు, మహబూబ్ బాషా, నరేష్, నరసింహా, శంకర్, రఫీ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు పంపిణీ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పేదలకు రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు పంపిణీ చేయాలని సిపిఎం పట్టణ నాయకులు రాముడు, కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని 4, 5, 6వ సచివాలయ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పేదలకు రేషన్ బియ్యంతో పాటు కందిపప్పును కూడా అందజేయాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థపై కలెక్టర్ సబ్ కలెక్టర్, తహశీల్దార్లతో పర్యవేక్షణను పెంపొందింపజేయాలని తెలిపారు. సిపిఎం నాయకులు సురేష్, చాంద్ బాషా, నాగరాజు, మోహిన్ బాష, వలీ పాల్గొన్నారు.

క్రీడల్లోనూ ప్రతిభ చాటాలి

- భాష్యం హైస్కూల్ ప్రిన్సిపల్ సురేంద్రబాబు

ప్రజాశక్తి - ఆదోని

చదువుతోపాటు క్రీడల్లోనూ పాల్గొని విద్యార్థులు ప్రతిభ చాటాలని భాష్యం హైస్కూల్ ప్రిన్సిపల్ సురేంద్రబాబు తెలిపారు. గురువారం ఇఎస్ఐ ఆస్పత్రి భాష్యం హైస్కూల్ నుంచి పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వరకు విద్యార్థులు సక్సెస్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనవరి 31, ఫిబ్రవరి 1న ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో భాష్యం విద్యాసంస్థలు ఇంట్రా స్పోర్ట్స్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఆదోని వన్, టూ, ఎమ్మిగనూరు బ్రాంచి విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొన్నారని చెప్పారు. కబడ్డీ, క్రికెట్, టెన్నికాయిట్, రన్నింగ్ రేస్, రిలే, ఖోఖో తదితర క్రీడలు రెండు రోజుల పాటు జరిగాయన్నారు. ఇందులో భాష్యం వన్ విద్యార్థులు అత్యధిక స్థానాల్లో ప్రథమ స్థానంలో ఉండి, ద్వితీయ స్థానాలు కూడా కైవసం చేసుకున్నారని తెలిపారు. 250కి పైగా బహుమతులు కైవసం చేసుకుని భాష్యం విద్యాసంస్థలకు వన్నె తెచ్చారని చెప్పారు. విద్యార్థులు శారీరకంగా బలంగా ఉంటేనే మానసికంగా కూడా దృఢంగా ఉంటారని విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ జోన్ల వారీగా ఇంట్రా స్పోర్ట్స్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించుకునేందుకు దోహదపడుతున్నాయని వివరించారు. వైస్ ప్రిన్సిపల్ భార్గవ్ పవన్, ప్రధానోపాధ్యాయులు శిరీష, ఫిజికల్ డైరెక్టర్ శంకర్, పవిత్ర, సుధాకర్, జీవన్ ఉన్నారు.

ADONI
Bhashyam High School, Adoni-1
Zonal Intra Sports Success Rally
సక్సెస్ మీట్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సురేంద్రబాబు

సిబ్బందితో సమీక్షిస్తున్న జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి

సమయపాలన పాటించాలి

- జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి ఆదేశించారు. గురువారం గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయాల పనితీరుపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయాల సిబ్బంది హాజరు శాతం కూడా తప్పనిసరిగా ఉండాలన్నారు. సమాచారం లేకుండా గైర్హాజరయ్యే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిడిఒ మణి మంజరి, ఇఒఆర్‌డి అనంతశయన, ఎఒ బాబు భాస్కర్, ఎపిఒ మహ్మద్ బాష పాల్గొన్నారు.

ఆర్థిక లోటును భర్తీ చేసే సమర్థుడు చంద్రబాబు

- జగన్ ఎన్ని అవతారాల ఎత్తినా 0.0నే - టిడిపి మహిళా నాయకులు విజయలక్ష్మి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత ప్రభుత్వం చేసిన ఆర్థిక లోటును భర్తీ చేయగల సమర్థుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టిడిపి మహిళా నాయకులు విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే బీవీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం దళితులకు అండగా ఉంటుందని, మహిళలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని సౌకర్యాలతో ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరెడ్డి హయాంలో నియోజకవర్గం మహా పట్టణంగా అవతరిస్తుందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దౌర్జన్యాలకు పాల్పడిందని విమర్శించారు. తిరిగి 2.0గా జగన్ కొత్త అవతారంతో ముందుకొస్తే ప్రజలు, దళితులు ఇంకెన్ని దారుణాలు చూడాలో అని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ఎన్ని అవతారాలు ఎత్తినా రాష్ట్ర ప్రజలు కచ్చితంగా '0.0' చేస్తారని తెలిపారు. జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి సర్వనాశనం చేశారని, ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక లోటును భర్తీ చేసి రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి పథంలో నడిపించగలిగే సమర్థుడు చంద్రబాబు ఒక్కరేనని చెప్పారు. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా పని చేస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. మహిళా కార్యకర్తలు సావిత్రి, శారద, సీనియర్ నాయకులు నాగప్ప, పేటయ్య, మునెప్ప, చిట్టెన్న, తెలుగు యువత లక్ష్మణ్, శ్రీను, తిమ్మప్ప, బలరాం, రాముడు, వీరేష్, నరసింహా, చంద్ర, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీవీని కలిసిన విజయలక్ష్మి

విద్యార్థులను బడికి దగ్గర చేయండి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి భరత్ రవి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేసి విద్యకు దగ్గర చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి భరత్ రవి, జిల్లా అధ్యక్షులు రంగప్ప కోరారు. ఉపాధి పనుల్లేక కరువుతో అల్లాడుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు వలసకు వెళ్తున్న పరిస్థితి ఉందని, విద్యార్థులకు సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేసి వారికి ప్రత్యేకంగా విద్యనందించే ప్రణాళిక చేయకుండా విద్యా శాఖ పాఠశాల కమిషనర్ వచ్చి లాంగ్ ఆబ్సెంట్ విద్యార్థుల జాబితాను తొలిగించడం దుర్మార్గమని తెలిపారు. గురువారం పట్టణంలో పట్టణ కార్యదర్శి విజయ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వలస కేంద్రంలో విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సింది పోయి, వారు లేరనే పేరుతో జాబితా నుంచి తొలిగించి, తల్లికి వందనం పథకానికి ఎగనామం పెట్టే దుష్ట ఆలోచనలు మానుకోవాలని డిమాండ్ చేశారు. వలసకు వెళ్లిన విద్యార్థుల జాబితాను పరిగణనలోకి తీసుకొని జిల్లా విద్యా శాఖ అధికారులు ఆ విద్యార్థులను పాఠశాలకు తిరిగి తీసుకొచ్చే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. వినోద్, శివ, సాయి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న భగత్ రవి

శ్రీమఠంలో ఘనంగా మధ్వ నవమి వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో మధ్వ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం మధ్వ నవమి సందర్భంగా స్థానిక శ్రీమఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో నవరత్న స్వర్ణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్వాచార్యుల చిత్ర పటాన్ని, రాఘవేంద్రస్వామి మూర్తిని నవరత్న స్వర్ణ రథంపై ఉంచి పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిధ్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో రథోత్సవం నిర్వహించారు. అంతకుముందు రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, పీఠాధిపతుల పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్.అప్రమేయచార్, సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, పురాణిక రాఘవేంద్ర చార్, గుంజల్లి విజయీంద్ర చార్, గోర్కల్ కృష్ణస్వామి, పిఆర్ఒ కార్యాలయ సిబ్బంది గురురాజ దేశాయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

మహా రాజశ్రీ ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ నందు

E.P.No.66/2021 in O.S.No. 307/2018

ముసల్ రెడ్డిగారి రితేష్ రెడ్డి,
తండ్రి: లేట్ రామ సురేష్ రెడ్డి,
వయస్సు 36 సం॥లు, హిందూ, బిజినెస్,
నంద్యాల టౌన్, నంద్యాల జిల్లా. ...డిక్రీ దారుడు

-Versus-

దేశ కృష్ణుడు, తండ్రి: తిమ్మా రెడ్డి,
వయస్సు 66 సం॥లు, హిందూ, బిజినెస్, ఇంటి
నెం.1-7, రాధకృష్ణ వేర్‌హౌస్, ఒంటివెలగల గ్రామం,
గోస్పాడు మండలం, నంద్యాల జిల్లా.,
C/o. Dr. శ్రావన్ కుమార్, డోర్ నెం: 49-50-A-9B-8-3, మాదానగర్, పాలకొట్టాల, టి.డి.పి. ఆఫీస్ ప్రక్కన,
కర్నూలు టౌన్ & జిల్లా. ...ఋణ గ్రస్తుడు

నోటీసు ప్రకటన

పైన తెలిపిన కోర్టులో పైన తెలిపిన డిక్రీదారుడు, పైన తెలిపిన ఋణ గ్రస్తుడిపై కోర్టు వారు ఇచ్చిన డిక్రీ మొత్తము రాబట్టుకొనుటకు అమలు పిటీశన్ ధాఖలు చేసి, ఋణ గ్రస్తుడి స్థిరాస్థుల వేలము కొరినాడు. సదరు పిటీషన్ లో ఋణ గ్రస్తుడవైన నీకు కోర్టు నుండి ఎన్ని మార్లు రూల్ 66 నోటీసులు పంపించిన కూడా నీవు తీసుకోకపోవడం వలన కోర్టు వారు ప్రకటణ ద్వారా నోటీస్ పంపమని ఉత్తర్వు వేసినారు. కోర్టువారి ఉత్తర్వు మేరకు ఈ ప్రకటన ద్వారా నోటీసు ప్రకటించబడినది. కావున పైన తెలిపిన కోర్టు యందు 19-02-2025 వ తేదీన ఉదయం 10:30 గం.. లకు నీవు హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల కోర్టు వారు నీ పరోక్షమున తీర్మానం చేయుదురు అని తెలియచేయదమైనది.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా తేదీ : 19-02-2025

ఇట్లు
B. రామ మోహన్ రెడ్డి,
D.Hr అడ్వకేట్, నంద్యాల,
సెల్ : 9440112592

దుకాణదారులు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- ఎస్ఐ చంద్రమోహన్

ప్రజాశక్తి - కోసిగి

ప్రతి దుకాణదారుడూ దుకాణంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెయిన్ రోడ్డుపై ఉన్న వ్యాపారులు షాపుల ముందు ఉన్న డ్రెయినేజీని దాటి వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. మెయిన్ రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, కార్లు, పలు వాహనాలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. షాపుల ముందు ఎలాంటి వాహనాలు నిలుపరాదన్నారు. అలా నిలిపితే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాబోయే రేణుక ఎల్లమ్మ జాతరను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపడతామన్నారు. ప్రత్యేకించి పంచాయతీ అనుమతి లేకుండా ఇష్టానుసారంగా మెయిన్ రోడ్లపై వ్యాపారం చేసుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోసిగిలో ఈ మధ్యకాలంలో ట్రాఫిక్ పెరగడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని దృష్టికి వచ్చిందని తెలిపారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు మండల అధికారులతో కలిసి ప్రణాళిక ఏర్పాటు చేస్తామన్నారు. మేజర్ పంచాయతీ కార్యదర్శి తిరుమల నాయుడు, ఎఎస్ఐ నాయక్ పాల్గొన్నారు.

దుకాణదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రమోహన్

DEVARA
NTR సేవా సమితి
మాట్లాడుతున్న ముజీబ్ అహ్మద్

నైపుణ్య ప్రదర్శనకు తరచూ టోర్నమెంట్లు

- క్రికెట్ అసోసియేషన్ తాలూకా ఉపాధ్యక్షులు ముజీబ్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

క్రీడాకారుల్లో దాగిన నైపుణ్యాన్ని ప్రదర్శించుకునేందుకు తరచూ క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నామని క్రికెట్ అసోసియేషన్ తాలూకా ఉపాధ్యక్షులు, టోర్నమెంట్ ఆర్గనైజర్ ముజీబ్ అహ్మద్ తెలిపారు. గురువారం క్రికెట్ టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు. పట్టణంలోని మున్సిపల్ మైదానంలో ఫ్రెండ్‌షిప్ కప్ ఆల్ డిపార్ట్‌మెంట్ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 7 నుంచి 9 వరకు జరుగుతుందన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల 17 జట్ల మధ్య పోటీ జరుగుతుందని తెలిపారు. ఫైనల్‌లో ప్రముఖుల చేత కప్ అందిస్తామన్నారు.